III
నమస్తే తెలంగాణ
తెలంగాణ జైత్రయాత్ర 2023
హైదరాబాద్ | గురువారం 30 నవంబర్ 2023 www.ntnews.com

# తెలంగాణ గడ్డపై.. ఇదీ కేసీఆర్ దస్కత్

మార్పంటే.. మాటల్లో చెప్పేది కాదు! మార్పంటే... ఏమార్చి చూపే అబద్ధాలు అంతకన్నా కాదు!! నిజమైన మార్పునకు కొలమానం ఈ నాడు–నేడు! 'ఎట్లున్న తెలంగాణ ఎట్లయింది' అన్న ఆశ్చర్యానికి చిరునామా ఈ చిత్తరువులు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన కేసీఆర్ పాలన మొదలుకావడమే మార్పునకు నాంది. ఆయన చేసిన తొలి దస్కత్ 'మిషన్ భగీరథ'గా ఇంటింటికీ తాగునీళ్లు ఇచ్చింది. కేసీఆర్ చేసిన మరో చేవ్రాలు.. ప్రభ కోల్పోయిన కాకతీయ రాజుల తటాకాలకు జలకళ తీసుకొచ్చింది. ఈ దార్శనికుడి మరో సంతకంతో.. గోదారమ్మ ఎల్లువెత్తి కాళేశ్వరుడి జట చేరి.. తెలంగాణ అంతా పరువళ్లు తొక్కి.. మాగాణాన్ని పరవశింపజేసింది. ఈ రాజర్షి ఇంకో హస్తాక్షరం యాదగిరిగుట్ట క్షేత్రాన్ని ఇలవైకుంఠంగా తీర్చిదిద్దింది. ఇలా మన ముఖ్యమంత్రి ప్రతి సంతకం 58 ఏండ్లు అరిగోసలు అనుభవించిన తెలంగాణకు సంతసాన్ని చేకూర్చింది. అర్హులైన ప్రతి పేదనూ ఆదుకున్నది. రైతును రాజును చేసింది. నేతన్నకు ధీమానిచ్చింది. గీతకార్మికుడికి తాటిచెట్టంత అండయ్యింది. ముసలవ్వకు ఆసరా అయ్యింది. ఒంటరి మహిళకు భరోసానిచ్చింది. ఆడబిడ్డకు పుట్టింటి సారె అయ్యింది. కల్యాణ వధువుకు షాదీ ముబారక్ చెప్పింది. ఒక్కమాటలో చెప్పాలంటే కేసీఆర్ దస్కత్.. పదేండ్ల తెలంగాణను ఉత్థాన శిఖరాలకు చేర్చి.. అసలు సిసలైన మార్పు అంటే ఏమిటో చాటిచెప్పింది. అందుకు సాక్ష్యమే ఈ చిత్రమాలిక...

నాడు

గిరిజన పోరాట యోధుడు కుమ్రం భీం అమరుడైన జోడెఘాట్ స్థలి ఆదివాసీలకు ఆరాధ్య క్షేత్రం. అక్కడికి వెళ్లాలంటే పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చేది. రాళ్లురప్పలు తేలిన రోడ్డుపై కుదుపులకు శరీరం పచ్చి పుండులా మారిపోయేది. రాళ్లు తేలిన ఈ దారిన గిరిజనుల అభివృద్ధి నత్త నడకన సాగింది.



దారిట్ల.. పోయేదెట్లా?

నేడు



ఇది తెలంగాణ రహదారి

కుమ్రం భీం స్మారక మందిరం, మ్యూజియాన్ని నెలకొల్పి జోడెఘాట్ రూపురేఖలు మార్చిన తెలంగాణ ప్రభుత్వం అక్కడి రహదారులను విస్తరించింది. రూ.15 కోట్లతో జోడెఘాట్ వెళ్లే దారిని ఇదిగో ఇలా సుందరంగా తీర్చిదిద్దింది. పచ్చని వనంలో పరుచుకున్న తెలంగాణ దారి గిరిజనుల పురోగతికి రహదారైంది!

నాడు



**ఎండిన ఏరుగా..** కాంగ్రెస్ పాలకులు దశాబ్దాలుగా తెలంగాణ దాహార్తిని పట్టించుకోలేదు అనడానికి నిదర్శనమే జనగామ నియోజకవర్గం దేవరుప్పలలో ఎండిపోయిన ఈ వాగు. భారీ వర్షాలు కురిసినప్పుడు నిండుగా పారే ఈ వాగు.. నాలుగు రోజులకే ఇసుక మేటలతో వట్టిపోయేది.

నేడు



**నిండుగ పారగా..** దేవరుప్పల వాగుకు జలకళ తీసుకు రావాలని తెలంగాణ ప్రభుత్వం గొల్లపల్లి దగ్గర భారీ చెక్‌డ్యాం కట్టించింది. ఇప్పుడు వానలు ముఖం చాటేసినా.. వాగు పొంగుతున్నది. చెక్‌డ్యాంపై నుంచి పారుతున్న నీళ్లు జలపాతాన్ని ఆవిష్కరిస్తున్నాయి.



**ఎరువుల యాతన** కాంగ్రెస్ హయాం అంతా కరువులే! దీనికి తోడు రైతన్నకు మరో కష్టం ఎరువుల కరువు. మండలానికి ఎరువుల కోటా విడుదలైందని తెలియగానే వ్యవసాయ సేవా కేంద్రాల్లో వాలిపోయేవారు రైతులు. తమ వంతు వచ్చే వరకు నిలబడే ఓపిక లేక చెప్పులను క్యూలో పెట్టేవారు. ఈ చెప్పుల బారు మెదక్ జిల్లాలోనిది.

నేడు



**ఎదురు చూపుల్లేవ్..** ఇప్పుడు ఎరువుల కోసం ఎగబడటం లేదు. చెప్పుల లైన్లు అంతకన్నా లేవు! పంటల సీజన్ మొదలవ్వకముందే.. సమృద్ధిగా ఎరువులు తెప్పించి మండలాలకు, గ్రామాలకు పంపించే వ్యవస్థను తెలంగాణ ప్రభుత్వం పటిష్ఠం చేసింది.

నాడు



**చరిత్రకు గ్రహణం** ఇది చెత్త పారేసే డంప్‌యార్డ్ కాదు. దీని కింద ఓ వారసత్వ సంపద సమాధి అయ్యింది. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ఎలా పాడుబడిందో హైదరాబాద్‌లోని బన్సీలాల్‌పేటలో ఉన్న మెట్లబావి దుస్థితిని చూస్తే తెలుస్తుంది. నగరం నడిబొడ్డున ఉన్నా.. అభివృద్ధికి నోచుకోకపోగా.. ఆగమైన తీరు కాంగ్రెస్ పాలనకు అద్దం పట్టింది.

నేడు



**వారసత్వం ఘనం** ఉనికిని కోల్పోయిన బావికీ ఊట ఉందని నిరూపించిన సన్నివేశమిది. ఈ అద్భుత కట్టడానికి ప్రాణం పోసింది బీఆర్ఎస్ ప్రభుత్వం. రూ.10 కోట్లతో బన్సీలాల్‌పేట మెట్లబావిని పునరుద్ధరించింది. వారసత్వ సంపద పరిసరాలను అందంగా మలిచి మెట్లబావిని ఘనమైన సెల్ఫీ జోన్‌గా తీర్చిదిద్దింది.



**నూతి లోతు దుఃఖం** నాటి పల్లె తెలంగాణ నీటి కష్టాలను ఈ చిత్రం కండ్లకు కడుతుంది. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కేశవగూడ సహా ఆ పంచాయతీ పరిధిలోని వజ్జర్, నాగుగూడ, జైతుగూడ, మహాదుగూడ, లెండి గూడ పల్లెలు ఇదిగో ఇలా ఒకే బావిని నమ్ముకొని ఎన్నో ఏండ్లు తిప్పలుపడ్డాయి.

నేడు



**ఇంటి ముందుకు సంతోషం** మిషన్ భగీరథ పుణ్యజలాలతో తెలంగాణలో తాగునీటి కష్టాలు పరారయ్యాయి. ఇంటి ముందుకే వచ్చిన నల్లాను చూసి పల్లె పడుచుల సంతోషానికి అవధుల్లేవు. శుద్ధ జలాలతో సీజనల్ వ్యాధుల భయం పూర్తిగా తొలగిపోయింది. పడకేసిన మన్యం అన్న వార్తలు కనుమరుగయ్యాయి.